క్లుప్తంగా

హంగర్ ఫ్రీ వాహనం ప్రారంభం



హంగర్ ఫ్రీ వాహనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలోని పాలకొండ రోడ్డులో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ వారు హంగర్ ఫ్రీ వరల్డ్ అనే కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజూ 150 మందికి ఆహారం అందించేందుకు శ్రీకారం చుట్టారు. దీనిలో భాగంగా అల్పాహార వాహనాన్ని శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో స్టోర్ హెడ్ వస్పీ, కెల్ల చిన్ని, డోల బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై శిక్షణ



మాట్లాడుతున్న ఫైర్ ఆఫీసర్ వీరప్రసాద్

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్దనున్న ఆనంద నిలయంలో ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ప్రకృతి వైపరీత్యాలపై శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అగ్నిమాపక శాఖ డిప్యూటీ ఫైర్ ఆఫీసర్ ఎం.వీర ప్రసాద్ ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను మాక్‌డ్రిల్ చేసి చూపించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మెన్ పి.జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా వేంకన్న నిజరూప దర్శనం



మూలవిరాట్ నిజరూప దర్శనం

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని నారాయణ తిరుమలలో కొలువైన వేంకటేశ్వర స్వామివారి కల్యాణోత్సవంలో భాగంగా శుక్రవారం స్వామివారి నిజరూప దర్శనం నేత్రపర్వంగా జరిగింది. ఆలయ అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో మూల విరాట్‌కు క్షీరాభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామివారి నిజరూప దర్శనం చేసుకున్నారు. అనంతరం మహాలక్ష్మి అమ్మవారి ఆరాధన, కుంకుమార్చనలు జరిగాయి. కార్యక్రమంలో ఈవో శ్యామలరావు, వేంకట రామానుజ సేవాదళం సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఎంపిక



యశశ్రీ




శరత్‌కుమార్

ఎచ్చెర్ల: ఇటీవల నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో లావేరు మండలంలోని బయ్యన్నపేట ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పాఠశాలలో చదువుతున్న కొన్ని శరత్‌కుమార్, కొన్ని యశశ్రీలు ఉత్తమ ర్యాంకులు సాధించి ఎంపికయ్యారు. దీంతో విద్యార్థులు, గైడ్ టీచర్లు వెంకటరమణ, శివకుమారి, సుధాలను హెచ్‌ఎం ఎం.శ్రీనివాస్, పీఎంసీ కమిటీ చైర్మన్ ఆదిబాబు తదితరులు అభినందించారు. భవిష్యత్‌లో ఉత్తమంగా రాణించాలని ఆకాంక్షించారు.

నేడు, రేపు ఆధ్యాత్మిక ప్రవచనాలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుజరాతీపేటలో ఉన్న రాజరాజేశ్వరీ లలితా మహా త్రిపుర సుందరీ దేవీ పీఠంలో జరుగుతున్న ఆదిశంకరాచార్యుల జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 10, 11వ తేదీల్లో ఆధ్యాత్మిక ప్రవచనాలు జరుగుతాయని పీఠం నిర్వాహకులు పెంట రామచంద్రశేఖరశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ పురాణ ప్రవచన కర్త మల్లాది వెంకట రామానాథ శర్మచే జగద్గురు ఆదిశంకరులు – ఆమ్నాయ పీఠముల వైభవం అనే అంశంపై సాయంత్రం 6 గంటల నుంచి ప్రవచనాలు జరుగుతాయన్నారు.

సూర్య ఘర్ యోజన వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఏఈఈ దుర్గాప్రసాద్

జి.సిగడాం: అర్హులందరూ ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనను వినియోగించుకోవాలని ఎంపీడీవో జి.రామకృష్ణారావు, ఏఈఈ పి.దుర్గాప్రసాద్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో లైన్‌మెన్, పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన ద్వారా ప్రతీ ఇంటికి నాణ్యమైన విద్యుత్ సౌకర్యం లభిస్తుందన్నారు. అనంతరం పలు గ్రామాలకు వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు.

జాడలో కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రె పిల్లలు(ఫైల్)



భౌబోయ్..!

- గ్రామాల్లో బెంబేలెత్తిస్తున్న కుక్కలు
- విచ్చలవిడిగా దాడులు చేస్తున్న వైనం
- నియంత్రణ చర్యలు శూన్యం

జి.సిగడాం: గ్రామాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. ఏ రోడ్డున చూసినా గుంపులుగా దర్శనమిస్తున్నాయి. టిఫిన్ షాపుల వద్ద, వీధుల్లో కూరగాయలు అమ్మేవారి వెంట పదుల సంఖ్యలో పరుగులు పెడుతున్నాయి. వృథా ఆహారాన్ని తినేందుకు గుంపుగుంపులుగా తిరుగుతున్నాయి. రోడ్లమీద ఎవరు దొరికితే వారిపై దాడి చేసి కాటు వేస్తున్నాయి. ముఖ్యంగా చిన్నారులను ఎక్కువగా కరుస్తున్నాయి. అలాగే ద్విచక్ర వాహనదారులు ఎక్కువగా కుక్కల వలన ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనంపై వెళ్లేటప్పుడు వెంటపడుతున్నాయి. అలా అని స్పీడ్‌గా వెళ్తే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఒకవేళ నెమ్మదిగా వెళ్తే కాటు వేస్తున్నాయి. మండలంలో గత 8 నెలల నుంచి సుమారుగా 125 మందికి గాయాలు, 150



గ్రామాల్లో సంచరిస్తున్న కుక్కలు



తాగునీటి బోరు వద్ద గుంపులుగా ఉన్న కుక్కలు

గొర్రెల, మేకలు, పశువులకు తీవ్రగాయాలు చేశాయి. వీటిలో 62 వరకు గొర్రెలు, మేకలు మృతి చెందాయి. కుక్క కాటుతో ప్రతిరోజూ ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరేవారి సంఖ్య భారీగానే ఉంటోంది. కానీ వాటిని నియంత్రించేవారే కరువయ్యారు. సంతానం లేకుండా చేసేందుకు ప్రత్యేక డ్రైవ్ అధికారులు చేపట్టడం లేదు.

అప్రమత్తంగా ఉండాలి



కుక్కల దాడితో గాయాలు పాలైన బాధితులకు ఆస్పత్రిలో సంబంధిత మందులను అందుబాటులో ఉంచాం. 24 గంటలూ వైద్య సేవలను అందిస్తున్నాం. ఇప్పటికే చాలామందికి కుక్కకాటు టీకాలు వేశాం. ప్రజలు మాత్రం అప్రమత్తంగా ఉండాలి. కుక్కకాటుకు గురైతే తప్పనిసరిగా ఆస్పత్రులను సందర్శించాలి.

– బుడుమూరు యశ్వంత్, వైద్యులు, జి.సిగడాం

భయాందోళన చెందుతున్నాం



గ్రామాల్లో చిన్నపిల్లలు, మూగజీవాలపై కుక్కలు దాడి చేస్తుండడంతో తీవ్ర భయాందోళన చెందుతున్నాం. ప్రభుత్వం తక్షణమే కుక్కల నిర్మూలనకు ఆదేశాలు జారీ చేయాలి. లేకపోతే చాలా వరకు ప్రాణనష్టం కలుగుతుంది. విచ్చలవిడిగా కుక్కలు తిరుగుతుండడంతో బయటకు వెళ్లాలంటేనే భయం వేస్తోంది.

– మీసాల సాధ్వీమణి, వైస్ ఎంపీపీ, జి.సిగడాం

గుంపులుగా వస్తున్నాయి



గ్రామాలకు ఎక్కువగా చీపురుపల్లి నుంచి అధికంగా కుక్కలు గుంపులు గుంపులు వస్తున్నాయి. అనంతరం ఒక్కసారిగా ప్రజలు, మూగజీవాలపై దాడులకు తెగబడుతున్నాయి. గతంలో కుక్కలు లేకుండా సుదూర ప్రాంతాలకు తరలించాం. అయినా వందలాది కుక్కలు గ్రామంలో సంచరిస్తున్నాయి. వీటి నిర్మూలనకు పంచాయతీ తీర్మానం చేయాలి.

– బూటు అప్పారావు, బాతువ, జి.సిగడాం

ఇబ్బందులు పడుతున్నాం



పగలు, రాత్రి సమయాల్లో ఒక్కరు, ఇద్దరం బయటకు వెళ్లాలంటే కుక్కలతో నానా ఇబ్బందులు పడుతున్నాం. ప్రతివీధిలో గుంపులు గుంపులుగా ఉండి జనాలపై దాడులు చేస్తున్నాయి. చిన్నారులను బయటకు పంపాలంటేనే భయం వేస్తోంది. తక్షణమే కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– వడిశ మహేశ్వరరావు, సర్పంచ్, దవళపేట

చెరువు ఆక్రమిస్తే కఠిన చర్యలు

సాక్షి ఎఫెక్ట్

రణస్థలం: రణస్థలం గ్రామ రెవెన్యూ సర్వే నంబర్ 13–1లో 6 ఎకరాల 24 సెంట్ల కొత్తబంద(కోనేరు)ను ఆక్రమించినవారు శిక్షార్హులని మండల తహసీల్దార్ ఎన్.ప్రసాద్ తెలిపారు. అడ్డగోలుగా చెరువు ఆక్రమణ శీర్షికతో సాక్షిలో శుక్రవారం కథనం ప్రచురితమైంది. ఈ వార్తపై స్పందించిన రెవెన్యూ అధికారులు శుక్రవారం చెరువు ఆక్రమించిన స్థలంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. అయితే చెరువు గర్భంలో నిర్మించిన ప్రహరీ గోడ, సెప్టిక్ ట్యాంక్ తొలగించకపోవడం, చెరువు కప్పిన మట్టి అలాగే ఉంచేయడంతో పలు అనుమానాలు తావిస్తోందని స్థానికులు చెబుతున్నారు.



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

విజయవంతం చేయండి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): లేబర్ కోడ్స్ కార్మికులకు వరమా–శాపమా అనే అంశంపై ఈనెల 11వ తేదీన శ్రీకాకుళంలో నిర్వహించనున్న సదస్సును జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావులు పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా సీఐటీయూ కార్యాలయంలో సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు చేయాలన్నారు. ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు మే 20న అఖిల భారత సమ్మె జయప్రదం చేయాలని కోరారు. పెట్టుబడిదారులకు ఉద్యోగులను, కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చేవిధంగా కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు తెచ్చిందని దుయ్యబట్టారు. స్వాతంత్ర్యం అనంతరం ప్రజల త్యాగాలతో జాతి నిర్మించుకున్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్, ప్రభుత్వరంగ పరిశ్రమలు, రైల్వేలు, బ్యాంకులు, ఎల్‌ఐసీ, రక్షణ రంగం, గనులు, ప్రకృతి వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు కేంద్రం వేగవంతంగా కదులుతోందని మండిపడ్డారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.వి.రమణ, అల్లు సత్యనారాయణ, పట్టణ కన్వీనర్ ఆర్.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

కనక మహాలక్ష్మికి ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: మండలంలోని కింతలమిల్లు జంక్షన్ వద్దనున్న కనక మహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడ ఉన్న అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి ప్రీతికరమైన రోజు కావడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

గ్రేడులపై కసరత్తు

ఎచ్చెర్ల క్యాంపస్: పంచాయతీల గ్రేడులపై పంచాయతీ రాజ్ సంస్థ కసరత్తు చేస్తోంది. గ్రేడ్–1, 2, 3లుగా పంచాయతీలను విభజిస్తారు. ఎచ్చెర్లలో 28 గ్రామ పంచాయతీలు ఉండగా, వాటిలో కుశాలపురం, తోటపాలేంలను శ్రీకాకుళం నగరపాలక సంస్థలో విలీనం చేశారు. ప్రస్తుతం 26 పంచాయతీలు ఉన్నాయి. వీటిని గ్రేడులుగా విభజించనున్నారు. కసరత్తు చివరి దశకు చేరినట్లు ఎంపీడీవో కార్యాలయం ఏవో వీవీఎస్ రామ్మోహన్ తెలియజేశారు.

సచివాలయాలకు గ్రహణం

- ప్రజలకు సక్రమంగా అందని సేవలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న వైనం
- మండల కేంద్రాలకు మళ్లీ పయనం

మండలం	ఎచ్చెర్ల	రణస్థలం	లావేరు	జి.సిగడాం
సచివాలయాలు	28	28	23	21
పంచాయతీలు	28	32	33	31

ఎచ్చెర్ల క్యాంపస్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజల వద్దకే ప్రభుత్వం అనే లక్ష్యంతో గ్రామాల్లో సచివాలయాలను మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేశారు. దీనిద్వారా ప్రజలకు కావాల్సిన అన్ని సేవలు గ్రామాల్లోనే అందేవి. అలాగే 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను అప్పటి ప్రభుత్వం నియమించింది. వీరే స్వయంగా ఇళ్ల వద్దకు వెళ్లి కావాల్సిన అన్ని పథకాలు ఇంటి వద్దకే చేర్చేవారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ వ్యవస్థకు గ్రహణం పట్టింది. వలంటీర్ వ్యవస్థ సేవలను ప్రస్తుత ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎచ్చెర్ల నియోజకవర్గంలోని ఎచ్చెర్ల, లావేరు, రణస్థలం, జి.సిగడాం మండలాల్లో 100 గ్రామ సచివాలయాలు ఉన్నాయి.

మళ్లీ మండల కేంద్రాలకు...

సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో మరలా మండల కేంద్రాలు చుట్టూ ప్రజలు ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రస్తుతం సచివాలయ ఉద్యోగుల ఖాళీలు అయితే భర్తీ చేయడం లేదు. సచివాలయాల కుదింపుపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. భవిష్యత్తులో సచివాలయాలు పూర్తిగా నిర్వీర్యం అయ్యే అవకాశం ఉంది. ప్రజలు గ్రామ సచివాలయాలు కొనసాగించాలని కోరుతున్నా ప్రభుత్వం ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యమివ్వడం లేదు.



అసంపూర్తిగా మిగిలిన ఎచ్చెర్ల గ్రామ సచివాలయ భవనం

సేవలకు ఇబ్బందులు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ వ్యవస్థ గాడి తప్పింది. అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవనాలకు నిధులు సైతం మంజూరు చేయడం లేదు. పౌర సేవలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. భవిష్యత్తులో ఇంకా గ్రామ సచివాలయాలు నిర్వీర్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

– దొంక వెంకటరమణ, చిలకపాలేం

ఆశయం దెబ్బ తింటోంది



గతంలో ఒక గ్రామానికి అవసరమైన పూర్తిస్థాయి సేవలు గ్రామ సచివాలయాల్లో అందేవి. ఆస్తుల రిజిస్ట్రేషన్లు వంటివి సైతం ప్రారంభించాలని అప్పటి ప్రభుత్వం భావించింది. ఇంకా పూర్తిస్థాయిలో ప్రజలకు సేవలు అందించాలనే లక్ష్యంతో ముందుకెళ్లింది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక సచివాలయాలను నిర్వీర్యం చేస్తోంది. ఫలితంగా ఆశయం దెబ్బ తింటోంది.

– బెందు రామారావు, ముద్దాడ

ఖాళీలు భర్తీ చేయడం లేదు



కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే వలంటీర్ వ్యవస్థను రద్దు చేశారు. వలంటీర్లు ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి సేవలు అందించేవారు. ప్రస్తుతం గ్రామ సచివాలయాలు సైతం ఉత్సవ విగ్రహాల్లా మారుతున్నాయి. సచివాలయ ఉద్యోగుల ఖాళీలు సైతం భర్తీ చేయడం లేదు.

– దుంప అప్పయ్యమ్మ, సర్పంచ్, సంతసీతారాంపురం

ఆదర్శనీయుడు గోపాలకృష్ణ గోఖలే

శ్రీకాకుళం అర్బన్: సామాజికవేత్త గోపాలకృష్ణ గోఖలే ఆదర్శనీయుడని ఏపీ సీఆర్‌పీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ గురుగుబెల్లి దామోదరరావు అన్నారు. గోపాలకృష్ణ గోఖలే 159వ జయంతి సందర్భంగా శ్రీకాకుళంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న గోఖలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రతినిధి ముద్దాడ రామకృష్ణ, శ్రీకాకుళం జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి పారుపల్లి శ్రీనివాసరావు, కొవ్వాడ సత్యనారాయణ, మల్ల మురళి, వడ్డి కామేశ్వరరావు, సీర గోవిందరావు, రావాడ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచిన తొలితరం ఉద్యమ నేత గోపాలకృష్ణ గోఖలే అని గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు సురంగి మోహనరావు, ఎం.ప్రసాదరావు, పందిరి అప్పారావు, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, కొంక్యాన వేణుగోపాల్, నిష్టల నరసింహమూర్తిలు అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల స్మృతి వనంలో శుక్రవారం గోఖలే విగ్రహానికి గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాత్మాగాంధీ లాంటి ఎందరో వ్యక్తులను తయారు చేసిన ఘనత గోఖలేకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్–102 గవర్నర్ కొంక్యాన మురళీధర్, లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, సువ్వారి రాజారావు తదితరులు పాల్గొన్నారు.



గోఖలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కొనసాగుతున్న ఆందోళన



ఆందోళన చేస్తున్న ఇంజినీరింగ్ సిబ్బంది

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు ఇచ్చింది తక్కువ, హడావుడి ఎక్కువగా ఉందని మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సంఘం గౌరవ అధ్యక్షుడు టి.తిరుపతిరావు అన్నారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు మూడోరోజు ఆందోళన కార్యక్రమాలు శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇంజినీరింగ్ కార్మికులకి న్యాయం చేయకుంటే, రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి ప్రభుత్వ వైఖరిని ఎండగడతామన్నారు. ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు టెక్నికల్, నాన్–టెక్నికల్‌గా పెంచి ఇవ్వాలని, సీనియారిటీ ప్రకారం ప్రమోషన్ ఇవ్వాలని, దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలన్నారు. రిటైర్మెంట్ వయస్సు 60 ఏళ్ల నుంచి 62కి పెంచాలని కోరారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఇంజినీరింగ్ కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్యామలరావు, సతీష్, నాయకులు ముఖేష్ యాదవ్, శంకర్, శ్రీను, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శూద్రగంగ కావ్యగాన సభ రేపు

శ్రీకాకుళం కల్చరల్: ప్రసిద్ధ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ రచించిన శ్రీశూద్రగంగ కావ్యగాన సభను ఈనెల 11వ తేదీన సాయంత్రం 5.30 గంటలకు బాపూజీ కళా మందిర్‌లో నిర్వహించనున్నట్లు సాహితీ స్రవంతి, శ్రీకాకుళ సాహిత ప్రతినిధులు కేతవరపు శ్రీనివాస్, అట్టాడ అప్పలనాయుడులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం సాహిత్య చరిత్రలో ఇది ఒక సువర్ణ ఘట్టం కానున్నదని పేర్కొన్నారు. కేతవరపు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగే ఈ సభలో కవి కావ్య పరిచయాన్ని అట్టాడ అప్పలనాయుడు చేయనున్నారని, కావ్యగానాంతరం సుద్దాల అశోక్ తేజకు ఆత్మీయ అభినందన కార్యక్రమం ఉందని తెలిపారు. ప్రముఖ రచయిత కవి గంటేడ గౌరునాయుడు, గార రంగనాథం, పీవీ నరసింహులు, చీకటి దివాకర్, కారసాల శ్రీనివాసరావు, కల్లేపల్లి రామ్‌గోపాల్, కంచరాన భుజంగరావు, డాక్టర్ కె.ఉదయ్‌కిరణ్, ఎస్.రుద్రమరాణి, బాడాన శ్యామలరావు, నెట్టిమ రమణారావులు పాల్గొంటారని తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం

రణస్థలం: మండలంలోని ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వాటిని పరిష్కరించే విధంగా ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. 126 అర్జీలను ప్రజల నుంచి స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు తగు చర్యలు నిమిత్తం ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎన్.ప్రసాద్, ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు, వెటర్నరీ ఏడీ బి.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

సంక్షిప్తంగా..


ప్రజలపై విద్యుత్ భారం మోపవద్దు



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

రణస్థలం: కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారం మోపవద్దని, యాక్సిస్ కంపెనీతో చేసుకున్న ఒప్పందం రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్ అమ్మనాయుడు, నాయకుడు వెలమల రమణలు డిమాండ్ చేశారు. యాక్సిస్ కంపెనీతో రాష్ట్ర డిస్కామ్‌లు కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని రావాడ రోడ్డులో శుక్రవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో డి.మహాలక్ష్మి నాయుడు, ఎం.నర్సింహులు, ఎస్.పాపారావు, కె.రామప్పడు తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా భూసార పరీక్షలు



మాట్లాడుతున్న ఏవో శారద

జి.సిగడాం: పంటలు వేసుకోవడానికి ముందే రైతులు పక్కాగా భూసార పరీక్షలు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి యర్రా శారద సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన అగ్రికల్చర్ అసిస్టెంట్ల సమావేశంలో మాట్లాడారు. మండలవ్యాప్తంగా 1,349 మట్టి నమూనాల సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఆర్‌ఎస్‌కేలో విధులు నిర్వహిస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్లు ద్వారా నమూనాలను సేకరించాలన్నారు. సమావేశంలో ఏఈవో అప్పారావు, అలుగోలు లక్ష్మీనారాయణ, అంపోలు అనుషా రాణి, హేమంత్, హరికృష్ణ, రాణి, కుసుమ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అదనపు బాధ్యతలు అప్పగింత

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఎంపీడీవోగా పరిపాలన అధికారి వీవీఎస్ రామ్మోహన్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ఇన్‌చార్జి ఎంపీడీవో మల్లేశ్వరరావు సస్పెండ్ అయ్యారు. ఈ నేపథ్యంలో రామ్మోహన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

జి.సిగడాం: కిశోర బాలికలంతా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎచ్చెర్ల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తమ్మినేని లక్ష్మి సూచించారు. మండల కేంద్రంలో కిశోర బాలికల ఆరోగ్యంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సకాలంలో పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. పుట్టిన బిడ్డకు వెంటనే తల్లి ముర్రిపాలు పెట్టాలని, దానివలన బిడ్డకు రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం.రాధిక, ఎస్.రమాదేవి, ఎ.భారతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

ఎచ్చెర్ల క్యాంపస్: బొంతలకోడూరులో వెలసి ఉన్న మీనాక్షి సహిత సోమసుందేశ్వర ఆలయంలో శుక్రవారం శివ పార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు రేజేటి రామచంద్ర శర్మతో కూడిన బృందం ప్రత్యేక పుజలు నిర్వహించింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.